క్లుప్తంగా

12న రక్తదాన శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 12న తలకొండపల్లి మండలం దేవునిపడకల్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతీయువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన నర్సమ్మ (61) అనారోగ్యానికి గురై గురువారం మృతి చెందింది. జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.7,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, ఉప సర్పంచ్ మణికంఠం, యాదయ్య, శేఖర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత ఫౌండేషన్ చేయూత..

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన భీమమ్మ ఇటీవల మృతి చెందింది. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గురువారం ఫౌండేషన్ సభ్యుడు నూనె రాఘవేందర్‌చే రూ.5000 బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నరేష్, శ్రీను, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవరెడ్డి గెలుపు ఖాయం: పీఆర్టీయూ



యాచారం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ప్రచారం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

యాచారం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తున్న పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్న కేశవరెడ్డి గెలుపు ఖాయమని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అండెం ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు. మొదటి ప్రాధాన్యత ఓటును చెన్నకేశవరెడ్డికి వేసి, అత్యధిక మోజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్‌యాదవ్, భోజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపు కుట్ర తగదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

తలకొండపల్లి: గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను దారి మళ్లించే ప్రయత్నం తగదని మండల సర్పంచ్‌లు కుమార్, రఘుపతి, రమేష్‌యాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏడాది కాలంగా జీపీలకు నిధులు రావడం లేదని తెలిపారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీఎస్టీ, ఐటీ, ఒసీ, సీనరేజ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బండి రఘుపతి, బక్కి కుమార్, పయ్యావుల రమేష్ యాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలాపూర్ మండల మధ్యాహ్న భోజన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

మీర్‌పేట: బాలాపూర్ మండల మధ్యాహ్న భోజన కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ జే.పెంటయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కృష్ణవేణి, ఉపాధ్యక్షులు గాయత్రి, ప్రధాన కార్యదర్శిగా ఫాతిమాబేగం, సహ కార్యదర్శి అంజమ్మ, కోశాధికారిగా వీరస్వామి, కమిటీ సభ్యులుగా మైసమ్మ, ఖతీజలత, విజయలక్ష్మి, సరిత, శ్రీలత, వనజ, సుమలత, సుధావేణి ఎన్నికయ్యారు. కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కమిటీ జిల్లా కార్యదర్శి స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

దర్గాకు సామగ్రి అందజేత

పహాడీషరీఫ్: బాబా షర్ఫొద్దీన్ దర్గా 757వ ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సొంతంగా మెట్లపైకి మ్యాట్, పది ఫ్యాన్లను అందించారు. పహాడీషరీఫ్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు పండెం కొండల్ యాదవ్ దర్గా కమిటీ ప్రతినిధులతో కలిసి ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సామగ్రిని బుధవారం రాత్రి వారికి అందజేశారు. దర్గా అభివృద్ధికి కృషి చేయడంతో సొంతంగా కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దర్గాకు తన సహాయం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

కబ్జా కోరల్లో జిలాన్‌ఖాన్ చెరువు

- ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి డంపింగ్
- కాలువను కబ్జా చేసి మరీ రోడ్ల ఏర్పాటు
- రియల్టర్లకు వత్తాసు పలుకుతున్న అధికారులు!



జిలాన్‌ఖాన్ చెరువులో మట్టి పోసి చదును చేసిన దృశ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: నలుగురికి ఉపయోగపడాలని నిర్మించిన చెరువులకు రక్షణ కరువైంది. నిజాం కాలంలో నిర్మించిన చెరువులపై అక్రమార్కుల కన్నుపడింది. దీంతో చెరుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణకు తెరలేపారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డుకు పక్కనే ఉన్న జిలాన్‌ఖాన్ చెరువు కబ్జాల పర్వంపై 'సాక్షి' ప్రత్యేక కథనం...

యథేచ్ఛగా చెరువు కబ్జా..

గ్రామాలు నిరంతరం నీటి వనరులతో పాడి పంటలతో పచ్చగా ఉండాలని నిజాం నవాబు కాలంలో జిలాన్‌ఖాన్ చెరువును తవ్వించారు. ఓఆర్ఆర్ నిర్మాణ పనుల వలన ఇప్పటికే సగానికి పైగా చెరువు బలైపోయింది. ఉన్నటువంటి కాస్త చెరువును కబ్జా రాయుళ్లు చెరబడుతున్నారు. జిలాన్‌ఖాన్ చెరువు ఎఫ్‌టీఎల్ 24.32 ఎకరాలు, ఆయకట్టు 37.09 ఎకరాలు ఉండాలి. ఇప్పటికే సగానికి పైగా చెరువు నామరూపాలు లేకుండా పోయింది. ఈ చెరువు ద్వారా బొంగ్లూర్‌తో పాటు ఎంపీ పటేల్ గూడ, మంగళ్‌పల్లి ప్రాంతాల నుంచి నీరు వెళ్లి పులందరి వాగులో కలిసి అనాజ్‌పూర్ సమీపంలో ఉన్న ఇందిరసాగర్‌లోకి వెళ్తాయి. ఇంతటి చరిత్ర కల్గిన చెరువు ప్రస్తుతం కబ్జాలకు గురవుతోంది. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. చెరువులో నీరు ఉన్నప్పటికీ నీటిలో మట్టిపోసి మరీ చదును చేస్తున్నారు.

మున్సిపాలిటీలో కలవడంతో..

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో చెరువులు, కుంటలను కాపాడాల్సి ఉంటుంది. వారం రోజులుగా చెరువు కబ్జాకు గురవుతోందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని బొంగ్లూర్ గ్రామస్తులు వాపోతున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో కలిసినప్పటి నుంచి భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అధికారులు కాసులకు కక్కుర్తిపడి అటువైపు చూడటంలేదని విమర్శలు గుప్పుమంటున్నాయి. 2018లో మిషన్ కాకతీయ ద్వారా రూ.42 లక్షలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం చెరువుకు మరమ్మతులు కూడా చేపట్టింది. అయినప్పటికీ రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పైపులు వేసి మరీ చెరువు కబ్జా..

జిలాన్‌ఖాన్ చెరువు నుంచి బయటకు వెళ్లే కాలువను కొందరు కబ్జా చేశారు. ఏకంగా పైపులు వేసి రోడ్డు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. అధికారులు స్పందించకపోవడంతో నీటి వనరులు కనుమరుగవుతున్నాయి. కబ్జాకు గురైన కాలువను, చెరువును కాపాడాలి.

చర్యలు తీసుకుంటాం



బొంగ్లూర్‌లోని జిలాన్‌ఖాన్ చెరువు కబ్జాకు గురి చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. కబ్జాకు గురైనట్లు మా దృష్టికి రాలేదు. మీరు చెప్పారు కదా తప్పకుండా సిబ్బందిని పంపించి పనులు నిలిపివేస్తాం. తప్పకుండా బాధ్యుతలపై చర్యలు తీసుంటాం.

– ఉషరాణి, డీఈ ఇరిగేషన్ శాఖ, ఇబ్రహీంపట్నం

ప్రగతి నివేదనకు ప్రజల మద్దతు

- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ ప్రభుత్వాన్ని బలపర్చాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: బీఆర్ఎస్ నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి అనాజ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న యాత్రకు మంచి స్పందన వస్తోందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సంతోషంగా ఉండాలంటే కేసీఆర్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. పాదయాత్ర ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం వచ్చిందని తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, సర్పంచ్ కావలి రంగయ్య ముదిరాజ్, ఎంపీటీసీ రాచపాక లావణ్యయాదగిరి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు చక్రవర్తిగౌడ్ పాల్గొన్నారు.



అనాజ్‌పూర్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు నేతల పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీలోని 12వ వార్డుకు చెందిన చుక్క రాములు, 6వ వార్డుకు చెందిన నూతనగంటి లక్ష్మమ్మ మృతిచెందారు. మృతుల కుటుంబాలను గురువారం బీజేపీ నేత ఆచారి, కౌన్సిలర్లు సుండూరి ఝాన్సీ, దివ్య, నాయకులు శేఖర్, శ్రీకాంత్‌సింగ్, మహేశ్, రవి, యాదయ్య, పరమేశ్, ఆనంద్, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పరామర్శించారు. ఆయ కుటుంబాలకు రూ.5వేలు చొప్పున ఆచారి సేవాదళం సభ్యులు ఆర్థికసాయం అందించారు. అలాగే నూతనగంటి లక్ష్మమ్మ కుటుంబాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు పరామర్శించి రూ.3వేల ఆర్థికసాయాన్ని అందించారు. స్థానిక నాయకులు నాగిళ్ల జగన్, గణేశ్, ఆంజనేయులు, మహేశ్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువైంది

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



తమ్మలోనిగూడ గ్రామంలో మహిళలకు సభ్యత్వం అందజేస్తున్న అరుణ

యాచారం: స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ల గడుస్తున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కార్యదర్శి మస్కు అరుణ అన్నారు. మండల పరిధిలోని తమ్మలోనిగూడలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక చోట మహిళలపై దాడులు, హత్యలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబాలను పోషించలేని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం మహిళలకు సంఘం సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, జంగారెడ్డి, రమాదేవి, బీరయ్య, నవీన, పూజ, నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహిద్దాం..

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి విద్యాసంస్థల ఆవరణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సిటీ సీనియర్ సివిల్ జడ్జీ మురళీమోహన్, రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి హాజరై వేడుకలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. పురుషులతో పోలిస్తే మహిళల్లో మేధాశక్తి ఎక్కువగా ఉంటుందని, మహిళలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో మరింతగా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపల్స్ రామచంద్రారెడ్డి, బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నులు వసూలైతలేవ్

- మార్చి 31తో ముగియనున్న గడువు
- మున్సిపాలిటీలో బకాయి రూ.3.34 కోట్లు



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఈ యేడాది ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నప్పటికీ పన్నుల వసూళ్లలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వెనుకబడివుంది. గృహ, వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్య భవనాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు పన్నుల రూపకంగా రూ.9.87 కోట్లు వసూలు చేయాల్సివుంది. అందులో కేంద్ర సంస్థలు, కార్యాలయాల పన్నులు సుమారు రూ.1.37 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల పన్నులు సుమారు రూ.48 లక్షలు రావాల్సివుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన పన్నులు పక్కన పెడితే రూ.8.02 కోట్లు ఇతర మార్గాల ద్వారా పన్నులు రావల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 ముగిసేందుకు కేవలం 20 రోజులు మాత్రమే మిగిలివుంది. ఇప్పటివరకు రూ.4.68 కోట్లు మాత్రమే పన్నుల రూపకంగా ఆదాయం మున్సిపాలిటీకి వచ్చింది. మరో రూ.3.34 కోట్లు ఇంకా వసూలు కావాల్సివుంది. మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరులు పన్నుల రూపకంగా వస్తుంది. ఇంటింటికి, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు, విద్యాసంస్థల వెంట మున్సిపల్ బిల్ కలెక్టర్లు పన్నుల వసూళ్లకు తిరుగుతున్నారు. మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు ఆయా విద్యాసంస్థల ఎదుట చావు డప్పు కొట్టించగా, మరికొన్ని షాపులను సీజ్ చేశారు. అయినప్పటికి పన్నులు సకాలంలో పన్నులు సకాంలో వసూలు కావట్లేదు.

చర్యలు తీసుకుంటాం



సకాలంలో పన్నులు చెల్లించని షాపులకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు తదితర వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆయా సంస్థల ముందు చావు డప్పు కొట్టిస్తాం. ప్రజలు చెల్లించే పన్నులతోనే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుంది. పన్నులు చెల్లించి సహకరించాలి.

– ఎండీ.యూసుఫ్, కమిషనర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

దేవునిపడకల్‌లో కంటి వైద్య శిబిరం



తుర్కయంజాల్: వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న కమిషనర్ సాబేర్ అలీ

తలకొండపల్లి: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకుని, దృష్టి లోపాలను సవరించుకోవాలని సర్పంచ్ శ్రీశైలం సూచించారు. మండల పరిధిలోని దేవుని పడకల్‌లో విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మయ్యతో కలిసి గురువారం కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. పద్దెనిమిదేళ్ల పైబడిన వారందరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి, లక్ష్మయ్య, మెడికల్ ఆఫీసర్లు మల్లికార్జున్, డాక్టర్ శివ, కల్పన, స్నేహ, హెచ్ఏ మల్లయ్య, రామచంద్రయ్య, రవి కుమార్, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు కేంద్రం పరిశీలన

తుర్కయంజాల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. గురువారం పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్ కొంద్రు మల్లేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్యనారయణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మహేశ్వరం: ఈ నెల 13న జరగనున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న పోలింగ్ స్టేషన్‌తో పాటు ఎన్నికల ఏర్పాట్లను గురువారం తహసీల్దార్ మహమూద్ అలీ పరిశీలించారు. మహేశ్వరం మండలానికి గడికోట మైదానంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 69వ నెంబర్ గల పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఓటర్లు సజావుగా ఓటు వేసేందుకు అనుకూలమైన ఏర్పాట్లను చేశామని తహసీల్దార్ మహమూద్ అలీ పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అంతకు ముందు పోలింగ్‌స్టేషన్‌లో ఎన్నికల రోజు చేయాల్సిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు స్వర్ణకుమారి, పావని పలువురు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మహిళా దినోత్సవ వేడుకల్లో డీసీపీ సాయిశ్రీ, సినీనటి మధుమిత

మీర్‌పేట: మహిళల ఆర్థికాభివృద్ధికి లియో కేర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మీర్‌పేటలోని మహిళాశక్తి భవన్‌లో లియో కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేడుకలకు సినీనటి మధుమితతో కలిసి డీసీపీ ముఖ్యఅతిథిగా హాజ రై మాట్లాడారు. లియో కేర్ ఫౌండేషన్ వారు ఎంతో మంది మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, మ గ్గం వర్క్స్‌తో పాటు ఇతర స్వయం ఉపాధి రంగా ల్లో శిక్షణ ఇస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని డీసీపీ కొనియాడారు. సినీనటి మధుమిత మాట్లాడుతూ.. ఆడ శిశువులను పురిటిలోనే చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్ల పుడితే కేవలం ఒక్క మహిళకే కాదు పురుషుడికి కూడా పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. అనంతరం వారు కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా దినోత్సవం సంద ర్భంగా వె య్యి రూపాయలకే సంవత్సరం మొత్తం అన్ని రకా ల వైద్య పరీక్షలు నిర్వహిస్తామని అను రాగ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు కళ్యాణి ప్రకటించారు. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, ఫౌండేషన్ చైర్మన్ లత, వైస్ చైర్మన్ జ్యోతి, భారతి, ఇతర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా హంసవాహన సేవ

- కొనసాగుతున్న దేవుని పడకల్ బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలివచ్చిన భక్తజనం



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి స్వామివారికి హంస వాహన సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని హంస వాహనంపై అధిష్ఠింపజేశారు. అర్చకులు పరవస్తూ గోపాలచార్యులు, శ్రీనివాసా చార్యులు, చక్రవర్తి చార్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య మంగళ వాయిద్యాలు మోగుతుండగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ప్రాంగణం నుంచి కల్యాణ మండపం వరకు శోభాయాత్ర సాగింది. సకల దేవతలు అష్టదిక్పాలకులు సప్త రుషులు స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వాన పూజలు చేశారు. కన్నుల పండువగా సాగిన ఈ కార్యక్రమాలకు అశేషంగా భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు సదుపాయాలు కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు తిరు కలాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం (తిరుకల్యాణం) నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, ఈఓ మోహన్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్యఅతిథిలుగా హాజరవుతారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించాని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రవి, ఆలయ అసిస్టెంట్ ఆంజనేయులు, సత్యం, కృష్ణగౌడ్, స్వామి, లక్ష్మయ్య, కృష్ణయ్య, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతుబంధు ఇవ్వాలి

- బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రెడ్డి



ఏఓ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న శేఖర్‌రెడ్డి

తలకొండపల్లి: అర్హులందరికీ రైతుబంధు మంజూర్ చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారి రాజుకు గురువారం ఆయన రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వ పరంగా మంజూర్ చేసిన రైతుబంధు పథకం ద్వారా కొంత మంది రైతులకు మాత్రమే రైతుబంధు డబ్బులు జమ అయ్యాయని, మరి కొందరికి జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 10 నుంచి 15 ఎకరాల లోపు ఉన్న 300 మంది రైతులకు రైతుబంధు జమ కాలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సుమారుగా రూ. 3 కోట్లు రైతుబంధు డబ్బులు మంజూర్ కావాల్సి ఉందన్నారు. రైతుబంధు డబ్బులు మంజూర్ కాకపోవడంతో రైతులు పంటల సాగు కోసం మిత్తి వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రైతుబంధు మంజూర్ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై ఏఓ రాజును వివరణ కోరగా, ట్రెజరీలో డబ్బులు జమ అయ్యాయని, త్వరలో విడుదల అవుతాయన్నారు. అనంతరం రైతుబంధు అందరికి అందనుందన్నారు. కార్యక్రమంలో జగదీశ్వర్, రైతులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు క్యాష్ రివార్డులు

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు యాదగిరి, రఘునాయక్‌కు షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ క్యాష్ రివార్డులు అందించి అభినందించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి గ్రామం వద్ద ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన కేసుకు సంబంధించి చాకచక్యంగా వ్యవహరించి గుర్తు తెలియని వాహనాన్ని కానిస్టేబుల్‌లు యాదగిరి, రఘునాయక్ గుర్తించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో షాద్‌నగర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో వారిని షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ఉపేందర్, ఎస్ఐ సుందరయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.



క్యాష్ రివార్డులు అందిస్తున్న ఏసీపీ కుషాల్కర్

సింగంపల్లి పాఠశాలలో రామ్‌లక్ష్మణ్



విద్యార్థులతో మాట్లాడుతున్న రామ్, లక్ష్మణ్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సింగంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ప్రముఖ సినీ ఫైటర్స్ రామ్, లక్ష్మణ్ సందర్శించారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. గత మూడు రోజులుగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బందిని సర్పంచ్ ప్రేమలత, ఫైట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్ సన్మానించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యాయులు ప్రియాంక, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, ఉపసర్పంచ్ గుంపెని పోచాలు, వార్డు సభ్యులు అనసూయ, యాదయ్య, సంతోష, సత్యం, రాజు, అంజమ్మ, కృష్ణయ్య, ఆమనగంటి నర్సింహ, పాఠశాల చైర్మన్ తిరుపతయ్య, అంగన్‌వాడీ టీచర్ సారమ్మ తదితరులు పాల్గొన్నారు.